ప్రజాశక్తి

శనివారం 19 ఆగస్టు 2023 8 పేజీలు


ప్రకాశం


బాపట్ల

బాధితులను ఆదుకోవడంలో విఫలం

కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి-దర్శి

దళిత మహిళలపై దాడి జరిగి నాలుగు రోజులు గడిచినప్పటికీ, బాధితులను ఓదార్చడంలో పాలకులు విఫల మయ్యారని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావు విమర్శించారు. దర్శి మండలం బొట్లపాలెంకు చెందిన బాధిత దళిత మహిళ కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. అనంతరం డిఎస్‌పి అశోకవర్ధన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. పోలీస్ స్టేషన్‌లో బాధిత మహిళ మౌనికను కలిసి పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బొట్లపాలెం గ్రామానికి చెందిన జక్కుల సాయిరాం అనే దళిత యువకుడు అదే గ్రామంలోని అగ్రకులానికి భార్గవిని ప్రేమించి పెళ్లి చేసుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేక బ్రహ్మారెడ్డి, పుల్లమ్మ అనే వారు సాయిరాం తల్లి అనూరాధ, అక్క మౌనికపై గొడ్డలితో దాడి చేశారన్నారు. ఈ ఘటనపై స్థానిక ఎస్ఐ రామకృష్ణ 307 సెక్షన్‌తో కాకుండా సాధారణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కౌంటర్ కేసు కూడా నమోదు చేసినట్లు తెలిపారు. ఇది


మౌనికను పరామర్శిస్తున్న నాయకులు

మరింత విడ్డూరంగా ఉందని విమర్శించారు. బాధితులు ఎస్‌పిని కలిస్తే గాని ఎస్ఐ కౌంటర్ కేసు ఎత్తివేయలేదన్నారు. ఈనెల 14న రాత్రి సమయంలో మౌనిక, అనూరాధ కళ్లలో కారం చల్లి గొడ్డలితో దాడి చేసినట్లు తెలిపారు. గుండెలపై కత్తులతో పొడిచి హత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. మౌనికను వివస్త్రను చేసి ఆమెపై పెట్రోల్ స్తంభానికి కట్టివేసినట్లు తెలిపారు. ఇదిఆటవిక చర్య అని వారు దయ్యబట్టారు. బాధితులకు న్యాయం చేయాలని ఎస్‌సి, ఎస్‌టి కమిషనర్‌ను కోరతామన్నారు. కేసును నీరుగార్చిన ఎస్ఐ చర్యలపై తీసు కోవాలన్నారు. బాధితులను పరామర్శించిన వారిలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం, సిఐటియు నాయకులు రంగారావు, సందు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

దారితప్పుతోన్న 'రెవెన్యూ'

- కలెక్టర్ ఆధీనంలో ఉన్నా ఈశాఖలో భారీగా అవినీతి
- క్షేత్రస్థాయిలో పాలకపక్ష నేతలతో కుమ్మక్కై భూ అక్రమాలు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

జిల్లాలో రెవెన్యూ శాఖ పూర్తిగా దారి తప్పింది. ప్రభుత్వానికి కీలకంగా ఉండాల్సిన ఈ శాఖ మరీ బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తోంది.మ క్షేత్రస్థాయిలో పాలనకు కేంద్రమైన రెవెన్యూ యంత్రాంగం ఇపుడు పూర్తిగా అక్రమాలు, అవినీతికి నిలయంగా మారింది. ప్రజలు నిత్యం తమ సమస్యలు, అవసరాల కోసం రెవెన్యూ వ్యవస్థతో సంబంధాలు కలిగి ఉంటారు. ఏ సమస్య పరిష్కారం కావాలన్నా గ్రామాల్లో విఆర్‌ఒనే కీలకం. అర్జీలు అయన వద్దకే మొదట వెళతాయి. అక్కడ నుంచి సంబంధిత శాఖకు పంపుతారు. ఇపుడు రెవెన్యూశాఖపై సరైన పర్యవేక్షణ లేదు. రాజకీయాలతో ఈ శాఖలో పోస్టింగులు వేయించుకుంటున్నారు. దీంతో వాళ్లూ వీళ్లూ కలిసి గ్రామాల్లో ప్రజల సందనను దోచు కుంటున్నారు. ప్రభుత్వ భూము లకు రక్షణ లేకుండా పోయింది. గతంలో సెంటు భూమి ప్రభుత్వం నుంచి పొందాలంటే ఎంతో కసరత్తు చేయాల్సి వచ్చేంది. ఇపుపు అదేమీలేదు. తెల్లారేసరికి ఆన్‌లైనులో పేర్లు ఎక్కించి



చేతిలో పట్టాలు పెడుతున్నారు. ఏళ్ల తరబడి వివిధ అవసరాల కోసం రిజర్వుడులో ఉంచి ప్రభుత్వ భూములను, ఇప్పటికే పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు ఖాళీగా ఉంటే వాటిని గుట్టుగా కాజేస్తున్నారు. పాలకపక్ష నేతలతో కలిసి గ్రామాల్లో యథేచ్ఛగా అసైన్డ్ భూములకు ఎసరు పెడుతున్నారు. ఒకవైపు రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నా. ఈ ఆగడాలు మాత్రం ఆగడం లేదు. రెవెన్యూ సిబ్బందే ఈ అక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. తాజాగా మద్రిపూడి మండలం లోని ఉదంతం రెవెన్యూ శాఖ పనితీరుకు అద్దం పడుతోంది. ప్రభుత్వ భూములను పాలకపక్ష నేతలు సిఫార్సు చేసిన వారిపేరుతో రాసేశారు. ఆన్‌లైనులోనూ ఎక్కించారు. దీంతో తహశీల్దారు, రెవెన్యూ సిబ్బందిపై కలెక్టర్ వేటు వేశారు. ఇదంతా పాలకపక్ష నేతలతో కలిసి చేశారు. భారీగా వసూళ్లు చేస్తున్నారు. అన్ని స్థాయిల్లో వీటిని పంచు కుంటున్నారు. అధికారులు, పాలకపక్ష నేతలు కలిసినందున ఏం చేసినా అడిగే నాధుడే లేరనే భావనలో ఉంటున్నారు. ఇక రెవెన్యూశాఖ పూర్తిగా కలెక్టర్ ఆధీనంలోనే ఉంటుంది. ఆయన ఉదయం లేచిమొదలు రాత్రి పొడు కునే వరకూ రెవెన్యూ శాఖతోనే ఎక్కువగా పని ఉంటుంది. ఇతర శాఖలపై సమీక్ష చేసినా రెవెన్యూనే కీలకం. అంతటి పర్యవేక్షణ ఉన్నా మండలాల్లో ఎందుకు అక్రమాలకు ▶ 2లో

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దష్టి సారించినట్లు కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు.కలెక్టరేట్ లోని స్పందన హాలులో 'ఉద్యోగుల స్పందన' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 39 అర్జీలు వచ్చాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు ప్రతి ▶ 3లో


ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

సమీక్షలు ఫలించేనా?

- బయటపడిన వైసిపిలోని విభేదాలు
- నేతల మధ్య తొలగని అంతరాలు


సమావేశంలో మాట్లాడుతున్న విజయ సాయిరెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

దక్షిణ కోస్తా జిల్లాల వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన విజయ సాయిరెడ్డి బుధ, గురువారాల్లో బాపట్లలో మకాం వేసి వైసిపి ఎమ్మెల్యేలు, నాలుగు నియోజక వర్గాల పార్టీ ఇన్‌ఛార్జులు, పరిశీలకులు, ప్రజాప్రతినిధులు, ఇతర నేతలతో సమావేశం నిర్వహించారు. తొలి రోజు ఎమ్మెల్యేలు ▶ 2లో

'సంక్షేమ' లబ్ధిని ప్రజలకు వివరించాలి: మంత్రి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. స్థానిక అంబేద్కర్ ఆడిటోరియంలో ఐదు మండలాల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ జగనన్న చెప్పాడంటే చేస్తాడన్న నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. భారతదేశ రాజకీయాల్లో ఓ చరిత్ర సష్టించిన జగన్మోహన్‌రెడ్డి రాజకీయాలకే రోల్ మోడల్‌గా నిలిచారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందేలా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మజీద్, ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్‌పిటిసి చేదూరి విజయ భాస్కర్, సర్పంచులు రామావత్ అరుణాబాయి, దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, ఏకుల జయమ్మ, ముసలారెడ్డి, కర్నాటి వెంకటేశ్వరరెడ్డి, వైసిపి మండల కన్వీనర్లు కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, బివి సుబ్బారెడ్డి, లింగారెడ్డి



సచివాలయం కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

పోలిరెడ్డి, గంటా వెంకట రమణారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్లు ఎస్ఎం జబివుల్లా, దోమకాల వెంకటేశ్వర్లు, నాయకులు నర్రెడ్డి వెంకటరెడ్డి, పి రాములు నాయక్, హరిబాబు నాయక్, బిటిబి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. మండల పరిధిలోని మిరియంపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం మంత్రి సురేష్ మాట్లాడుతూ సంక్షేమ పాలనతో పేదల మనసుల్లో సిఎం జగన్మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. గత టిడిపి పాలనను, ప్రస్తుతం వైసీపీ పాలనను పరిశీలించాలన్నారు. సిఎం జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు వంద శాతం అమలు చేశారన్నారు. గ్రామ సచివాలయ, వలంటరీ వ్యవస్థల ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే కాకుండా గడప గడపకూ సంక్షేమ ఫలాలను చేరవేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపిపి ఆళ్ల ఆంజనేయరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ సింగారెడ్డి పోలిరెడ్డి, డిఎల్‌డిఒ సాయికుమార్, తహశీల్దారు కిరణ్, ఎంపిడిఒ సత్యనారాయణ, వైసిపి నాయకులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

దారితప్పుతోన్న 'రెవెన్యూ'

(మొదటిపేజీ తరువాయి)

అక్రమాలకు పాల్పడుతున్నారు? గతంలో పలువురిపై చర్యలు తీసుకున్నా ఎందుకు ఈ అక్రమాలు ఆగడం లేదన్నదీ ప్రశ్నార్ధకంగా మారింది. చర్యలకు గురవుతున్న అధికారులకు రెండు, మూడు నెలల తర్వాత మళ్లీ పాలకపక్ష కీలక నేతలు అధికారులపై ఒత్తిడి చేసి పోస్టింగులు ఇప్పిస్తున్నారు. అక్రమాలు చేసిన మండలాల నుంచి తప్పించి ఇతర మండలాల్లో పోస్టింగులు వేయించుకుంటున్నారు. ఎమ్మెల్యే అండతో మళ్లీ విధుల్లోకి చేరిపోతున్నారు. పోస్టింగులకు పెద్ద ఎత్తున ఖర్చు పెడుతున్నారంటే ఎంత సంపాదిస్తున్నారో చెప్పాల్సిన అవసరం లేదు. గతంలో మార్కాపురం మండలంలో 378 ఎకరాలు ప్రభుత్వ భూములను అక్రమంగా ఆన్‌లైనులో ఎక్కించారు. ప్రజాశక్తిలో ఈ అక్రమాలపై కథనాలు వచ్చాయి. స్పందించిన అప్పటి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్11 మంది విఆర్‌ఒలు, ఒక సర్వేయర్, ఎఆర్‌ఐని సస్పెండ్ చేశారు. తర్వాత ఉద్యోగ విరమణ చేసినా తహశీల్దారుపై క్రిమినల్ కేసు పెట్టారు. అక్కడున్న ఎమ్మెల్యే సహకారంతోనే ఈ భూములను కాజేశారని ప్రతిపక్షం ఆరోపించింది. టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రలోనూ ఈభూముల వివరాలు మీడియాకు సభ నుంచే వెల్లడించారు. కురిచేడు మండలం పొట్లపాడు గ్రామంలో ఇద్దరి పేరుతో 80 ఎకరాలను ఆన్‌లైనులో ఎక్కించారు. ఇక్కడా తహశీల్దారు సస్పెండ్ అయ్యారు. దర్శి మండలంలో కురిచేడుకు వెళ్లే రహదారిలో పెద్దఎత్తున అసైన్డ్ భూములను పాలకపక్ష ముఖ్యనేత కొనుగోలు చేశారనే ప్రచారం సాగుతోంది. కొండలను కాజేస్తున్నారు. సిఎస్‌పురం మండలం రేగులచెలకలో వంద ఎకరాలకుపైగా అసైన్డ్ భూములను అప్పటి తహశీల్దారు ఆన్‌లైనులో ఎక్కించారు. కనిగిరి ప్రాంతంలో దొంగ పట్టాలతో జనాన్ని మోసం చేశారు. రెండ్రోజుల క్రితం ఆర్‌డిఒకు ఫిర్యాదులు అందాయి. వారిపై క్రిమినల్ కేసులకు ఆదేశించారు. కనిగిరి నియోజకవర్గంలో పలు మండలాల్లో అసైన్డ్ భూములకు దొంగపట్టాలు తయారు చేశారు. వాటిని కొందరికి అమ్మారు.వీటిపై నేరుగా ఆర్‌డిఒ పోర్జరీ సంతకాలు చేశారు. ఇదే ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ వ్యవహారంలో రెవెన్యూ సిబ్బంది సహకారం ఉందని తెలుస్తోంది. ఇలా అనేక చోట్ల ప్రభుత్వ, అసైన్డ్ భూములను పాలకపక్ష నేతలకు చెందిన బినామీల పేర్లతో ఆన్‌లైనులోకి తెల్లారేసరికి ఎక్కిస్తున్నారు. గుట్టుగా సాగే ఈఅక్రమాలకు రెవెన్యూశాఖ అధికారులే అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. కోట్లలో చేతులు మారుతున్నాయి. చర్యలు తీసుకున్నాక కొద్ది రోజులకే వేరేచోట్ల చేరిపోతున్నారు. బాధ్యతా రాహిత్యంగా మారిన రెవెన్యూ వ్యవస్థను దారిలోపెట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరంఉంది.

సమీక్షలు ఫలించేనా?

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ ఇన్‌ఛార్జులు, ముఖ్య నేతలతో సమీక్ష జరిపారు. రెండో రోజు జిల్లాలోని ఆరు నియోజకవర్గాల నుంచి ఎంపిక చేసిన నేతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులు, అసమ్మతి వ్యవహారాల గురించి చర్చించినట్లు తెలిపారు. పర్చూరు, చీరాల, అద్దంకి, బాపట్ల నియోజకవర్గాల్లో చోటు చేసుకున్న ఘటనలు, అసమ్మతి వాదుల గురించినట్లు తెలిసింది. చీరాల నియోజకవర్గంలో పర్చూరు ఇన్‌ఛార్జిగా ఉన్న ఆమంచి కృష్ణమోహన్ జోక్యం గురించి, రామన్నపేట వార్డు ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న ఘటనలు, ఆమంచి చేసిన వాఖ్యలు, చీరాల, పర్చూరు నియోజకవర్గాల గురించి చర్చ జరిపినట్లు తెలిసింది. ఎవరి పరిధిలో వారు పని చేసుకోవాలని, ఇతర నియోజకవర్గాలల్లో జోక్యం తగదని విజయసాయిరెడ్డి పార్టీ ఇన్‌ఛార్జులకు స్పష్టం చేశారు. అసమ్మతివాదులు పార్టీ నిర్ణయాల మేరకు నడుచుకోవాలని, ఇన్‌ఛార్జులకు వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపడితే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన సమావేశంలో పర్చూరు నుంచే ఎక్కువ సంఖ్యలో అసమ్మతి వాదులు హాజరయ్యారు. రీజనల్ కో-ఆర్డినేటర్ ముందు రెండు గ్రూపులుగా చెరో వైపు కూర్చున్నారు. చిన్నగంజాం, పర్చూరు ఎంపిపి, జడ్‌పిటిసిలు ఆమంచి వ్యతిరేక శిబిరంలో కూర్చున్నారు. యద్దనపూడి ఎంపిపి, కారంచేడు, ఇంకొల్లు జడ్‌పిటిసిలు వ్యతిరేకంగా ఉన్నారు. ఎస్‌సి, బిసి నేతలు ఆమంచికి వ్యతిరేకంగా సమావేశంలో గళం విప్పారు. విజయసాయిరెడ్డి అందరూ కలిసి పని చేయాలని ఉద్బోధ చేశారు. పర్చూరు అసమ్మతినేతలు విజయసాయిరెడ్డిని విడిగా కలిసిన సమయంలో 14 మందిపై రౌడీషీట్‌లు అక్రమంగా పెట్టారని చెప్పారు. తాను పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు సమాచారం. పర్చూరు వైసిపిలోని అసమ్మతివాదులు ఆమంచితో కలసి పనిచేసే పరిస్థితులు కనిపించడం లేదు. ఆదిశగా చర్చలు కూడా జరగలేదు. అద్దంకి ఇన్‌ఛార్జి కృష్ణచైతన్యకు వ్యతిరేకంగా ఉన్నవారు ఈ సమావేశాని హాజరయ్యారు. తమ వాదనలు విజయసాయిరెడ్డి ముందు వినిపించారు. ఇప్పటికే అసమ్మతి వాదులుగా ఉండి పార్టీ నుంచి సస్పెండ్ అయిన వారిని తిరిగి పార్టీలోకి తీసుకుంటామని అందరూ కలసి పనిచేయాలని విజయసాయిరెడ్డి చెప్పారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతిని వ్యతిరేకిస్తున్న నేతలు సమావేశంలో తమ గళం విప్పారు. చీరాల నియోజకవర్గ సమావేశానికి ఆమంచి గ్రూపునకు చెందిన వారెవరూ హాజరు కాలేదు. వారికి ఆహ్వానం ఉన్నప్పటికీ సమావేశానికి దూరంగా ఉన్నారు. సమావేశాల్లో అభ్యర్థుల ప్రకటనలు ఏమి లేవని విజయసాయిరెడ్డి చెప్పారు. అయితే చీరాల నుంచి కరణం వెంకటేష్‌ను గెలిపించండి చెప్పినట్లు వెల్లడైంది. వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో అసమ్మతి వాదులెవరు బయటపడనందున సమావేశాలు సాధారణంగానే జరిగాయి. రెండు రోజులపాటు నిర్వహించిన సమావేశాల్లో వైసిపి నేతలందరూ కలసి పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. అసమ్మతివాదులు చెప్పిన అన్ని విషయాలను కూడా ఆయన విన్నారు. పర్చూరు అంశాన్ని పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్తామన్నారు. అద్దంకి, బాపట్ల నుంచి పార్టీ నిలబెట్టిన వారిని గెలిపించాలని సూచించారు. ఈ సమీక్షలో జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, అక్కడి నేతల విజయావకాశాల గురించి విజయసాయిరెడ్డికి బోధపడింది. కొన్నిచోట్ల పార్టీ ఇన్‌ఛార్జులను మార్చాలన్న విషయం తేటతెల్లమైంది.

రెండో విడతలో నియోజకవర్గాల వారీగా పర్యటన..

ఎన్నికల ముందస్తు ప్రణాళికల్లో భాగంగా మొదటి విడత అన్ని జిల్లాల్లో పర్యటించిన అనంతరం రెండో విడతలో అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి పార్టీ నేతలతో సమావేశం నిర్వహించనున్నట్లు విజయసాయిరెడ్డి చెప్పారు. మూడవ విడతలో ప్రతి మండలంలోనూ ప్రజలకు మరింత మెరుగైన సేవలందించే లక్ష్యంతో వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ దశలోనే పార్టీ అభ్యర్థుల పేర్లు ప్రకటించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

ఇద్దరు సర్పంచులు, 11 వార్డు మెంబర్లకు ఎన్నిక నేడే

ప్రజాశక్తి-బాపట్ల

జిల్లాలో వివిధ కారణాలతో గతంలో నిలిచిపోయిన గ్రామ పంచాయతీ సర్పంచుల, వార్డు మెంబర్ల ఎన్నికలను శనివారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి దాసరి రాంబాబు తెలిపారు. జిల్లాలో జరగనున్న గ్రామ పంచాయతీ వార్డు ఎన్నికలకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. చుండూరు మండలం మున్నంగివారిపాలెం, ఇంకొల్లు మండలం పావులూరులో సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. రెండు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలతో పాటు జిల్లాలో 11 వార్డు మెంబర్ల ఎన్నికలను నిర్వహిస్తున్నామని తెలిపారు. చుండూరు మండలం మున్నంగివారిపాలెం గ్రామ పంచాయతీ జనరల్ అభ్యర్థులకు కేటాయించారు. అక్కడ పంచాయతీ సర్పంచ్ పదవి ఎన్నికల బరిలో అమ్మిశెట్టి శ్రీరామమూర్తి, తిప్పిరెడ్డి మల్లేశ్వరరెడ్డి పోటీలో ఉన్నారు. ఇంకొల్లు మండలం పావులూరు గ్రామ పంచాయతీ ఎస్సీలకు రిజర్వు అయింది. అక్కడ సర్పంచ్ అభ్యర్థులుగా బొల్లెద్దు లూధియమ్మ, వలేరు ఎలీషా పోటీలో ఉన్నారు. అదేవిధంగా జిల్లాలో 35వ వార్డు మెంబర్లకు ఎన్నికలు జరగాల్సి ఉంది. వారిలో 24 మంది వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలు జరగాల్సిన బాపట్ల మండలం జిల్లెళ్లమూడి గ్రామ పంచాయతీలో 6వ వార్డు, కర్లపాలెం మండలం బుద్ధాం గ్రామ పంచాయతీలో 6వ వార్డు, అమర్తలూరు మండలం మూల్పూరు గ్రామ పంచాయతీలో 2,4 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. నగరం మండలం చిన్నమట్లపూడి గ్రామ పంచాయతీలో మూడో వార్డు, రేపల్లె మండలం బేతపూడి గ్రామ పంచాయతీలో ఏడో వార్డు, కొల్లూరు మండలం చిలుమూరు గ్రామ పంచాయతీలో 4, దోనేపూడి గ్రామ పంచాయతీలో ఐదో వార్డు, వేమూరు మండలం వరాహపురం గ్రామ పంచాయతీలో పదో వార్డు, అద్దంకి మండలం శంఖవరపాడు గ్రామ పంచాయతీలో ఎనిమిదో వార్డు, కారంచేడు మండలం స్వర్ణ గ్రామ పంచాయతీలో 13వ వార్డుకు పోటీలో ఉన్న సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు కేటాయించినట్లు తెలిపారు.



జిల్లా పంచాయతీ కార్యాలయం

జాతీయ రహదారిపై మృతదేహంతో ధర్నా

ప్రజాశక్తి-చెరుకుపల్లి

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో 17 రోజులుగా చికిత్స పొంది నాలుగు ఆపరేషన్లు నిర్వహించినా, మహిళ మృతి చెందడంతో నడింపల్లి ఎస్సీ కాలనీ వాసులు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ మృతదేహంతో జాతీయ రహదారిపై ధర్నా చేశారు. ఈ సంఘటన శుక్రవారం మండల పరిధిలోని నడింపల్లి గ్రామంలో జరిగింది. వివరాల మేరకు.. నడింపల్లి ఎస్సీ కాలనీకి చెందిన గుమ్మడి నిర్మల(47) ఆగస్టు రెండో తేదీన రోడ్డుపై వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన ఒక యువకుడి ద్విచక్ర వాహనం ఆమెను ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయింది. ఈ మేరకు చెరుకుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిర్మల నడుము కింద భాగంలో తీవ్ర గాయాల పాలవడంతో ఆమెకు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగు సర్జరీలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయినప్పటికీ ఆమె మృతి చెందడంతో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కాలనీవాసులు, గ్రామస్తులు, బంధువులు నాలుగు గంటల పాటు ధర్నా నిర్వహించారు. రేపల్లె రూరల్ సీఐ ఏ శివశంకర్, ఎస్ఐ వై సురేష్, సిబ్బంది బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఆందోళన విరమింపచేశారు.



మృతదేహంతో జాతీయ రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు

పని సర్దుబాటు రద్దు చేయాలని ఫ్యాప్టో ధర్నా

ప్రజాశక్తి-బాపట్ల రూరల్: ఉపాధ్యాయుల జీతాలు, పని సర్దుబాటు, పని భారం సమస్యలపై శుక్రవారం బాపట్ల డిఇఒ కార్యాలయం వద్ద ఫ్యాప్టో నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా విద్యా శాఖ అధికారి రామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు జరిగి మూడు నెలలు కాకుండానే మరలా పని సర్దుబాటు చేయడం సరికాదని అన్నారు. సర్దుబాటు ప్రక్రియను నిలుపుదల చేయాలని కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జీవో 117 పేరుతో రేషనలైజేషన్ జరిగి మూడు నెలలు పూర్తి కాకుండానే మరలా రేషనలైజేషన్ చేయటం పట్ల తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బీ శ్రీనివాస్, సెక్రెటరీ జనరల్ సురేష్, సీనియర్ నాయకులు చాంద్‌బాషా, జిల్లా సెక్రెటరీ శ్రీనివాసరావు, నాయకులు విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు కలెక్టరేట్: జిల్లాలో పని సర్దుబాటు ప్రక్రియను నిలుపుదల చేయాలని కోరుతూ డిఇఒ సుబ్బారావుకు ఫ్యాప్టో జిల్లా నేతలు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. బదిలీలు జరిగి 3 నెలలు కాకుండానే మరలా ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయడం పట్ల రాష్ట్ర ఫ్యాప్టో తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. 2023 జూన్‌లో బదిలీలు, రేషనలైజేషన్, ప్రమోషన్స్ రాష్ట్ర విద్యాశాఖ నిర్వహించినట్లు తెలిపారు. అందులో బదిలీ అయిన 10వేల మందికి పైగా ఉపాధ్యాయులకు 3 నెలలు కావస్తున్నా జీతాలు అందలేదన్నారు. బదిలీలలో రిలీవర్ రాలేదని, సుమారు 1000 మంది ఉపాధ్యాయులు ఇప్పటికీ రిలీవ్ కాకుండా అదే పాఠశాలలో కొనసాగుతున్నారన్నారు. ప్రస్తుతం వీరిని రిలీవ్ చేసినా మరల అదే పాఠశాలలో విధులు నిర్వహించాలని ఉత్తర్వులు ఇవ్వటాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. డిఇఒను కలిసిన వారిలో ఫ్యాప్టో జిల్లా నాయకులు ఎస్ రవి, బి రఘుబాబు, పి సువర్ణ బాబు, శేషారావు, వై వెంకట్రావు ఉన్నారు.



డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

(మొదటి పేజీ తరువాయి)

నెలా 3వ శుక్రవారం ఉద్యోగుల స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సర్వీసు అంశాలలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పనిచేస్తున్న ప్రదేశంలో వారికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఉద్యోగులు ఇచ్చిన అర్జీలను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ఉద్యోగులు ఉత్తమ సేవలు అందించేలా నిబంధనల మేరకు వారికి కావాల్సిన ప్రతి అవసరాన్ని తీరుస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ కె శ్రీనివాసులు, డిఆర్ఒ ఆర్ శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ప్రైవేట్ ట్రావెల్ బస్సులో అక్రమంగా మత్తు పదార్థాలు తరలిస్తున్న వ్యక్తిని మార్టూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ థెరిస్సా ఫిరోజ్ ఎస్ఐ కోడూరి కమలాకర్ తమ సిబ్బందితో అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. సీఐ కథనం ప్రకారం.. గుంటూరు పట్టణంలోని రెడ్డిపాలెం బరిస్టా కాఫీ సెంటర్‌లో నివాసం ఉంటున్న షేక్ నిజాముద్దీన్ స్థానికంగా కర్ణుమా అబ్దుల్ టుబాకో కంపెనీలో పనిచేస్తున్నాడు. గత కొంత కాలంగా మత్తు పదార్థాలకు బానిసగా మారిన నిజాముద్దీన్ ఇటీవల బెంగళూరు వెళ్లిన నేపథ్యంలో అక్కడ సిటీ బ్రిగేడ్ రోడ్డులో ఉన్న ఓ పబ్‌లో పరిచయమైన నాని అనే వ్యక్తి ద్వారా 8 గ్రాముల మేటా మెఫ్తామీన్, మత్తు పదార్థాన్ని రూ.16 వేలకు కొనుగోలు చేసి బెంగళూరు నుంచి గుంటూరుకు ఆరెంజ్ ట్రావెల్స్ బస్సులో వస్తున్నాడు. ఈ క్రమంలో బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా బస్సులో పోలీసులను చూసి కంగారుపడిన నిజాముద్దీన్‌ను అదుపులోకి తీసుకొని పరిశీలించగా బ్యాగ్‌లో మత్తు పదార్థం ఉన్న పొట్లాన్ని, సెల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఫిరోజ్ తెలిపారు.

అభినందించిన ఎస్పీ

మత్తు పదార్థాలు తరలిస్తున్న నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన మార్టూరు సీఐ షేక్ థెరిస్సా ఫిరోజ్, ఎస్ఐ కోడూరి కమలాకర్, ఏఎస్ఐలు షేక్ సైదా, షేక్ మహబూబ్ బాషా, సిబ్బంది సుబ్బారావు, కోటేశ్వరరావు ప్రసాద్‌లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు.

ఇద్దరు ఉపాధ్యాయులపై కేసు: డిఎస్‌పి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పుల్లలచెరువు జడ్పి ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన సంఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయులపై కేసు నమోదు చేశామని మార్కాపురం డిఎస్పీ వీరరాఘవరెడ్డి తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం పుల్లలచెరువు జడ్పి పాఠశాలను ట్రైనీ ఐపీఎస్ అంకిత సురాన, మార్కాపురం డిఎస్పీ వీరరాఘవరెడ్డి, యర్రగొండపాలెం సిఐ మారుతీకృష్ణ సందర్శించారు. వారు విద్యార్థులను, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా విచారించి నివేదికలు తయారు చేశారు. ఈ సందర్భంగా మార్కాపురం డిఎస్పీ వీరరాఘవరెడ్డి మాట్లాడుతూ ఈ పాఠశాలకు ఎంతో చరిత్ర ఉందన్నారు. ఎంతో మందికి ఉపాధి కల్పించిన పాఠశాల అని తెలిపారు. కేవలం ఉపాధ్యాయుల మధ్య అవగాహన లోపంతోనే ఇలా జరిగిందని అన్నారు. ఉపాధ్యాయులు మంచి వాతావరణంలో విద్యార్థులకు మంచి బోధన జరిగేలా చూడాలన్నారు. ఈ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఎంతో ప్రతిభా సామర్థ్యాలు ఉన్నవారు ఈ పాఠశాలలో ఉండడం విద్యార్థుల అదృష్టం అన్నారు. విద్యార్థులకు నష్టం జరిగే పనులు చేస్తే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. ఉపాధ్యాయులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు. పాఠశాలలో ప్రశాంత వాతావరణం కల్పించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చూడాలన్నారు. పాఠశాలలో విచారణ చేసిన విషయాలు కోర్టులో గానీ, అధికారులకు గానీ అందజేస్తామని డిఎస్‌పి తెలిపారు. విధుల పట్ల జరిగే విషయాలపై విద్యాశాఖ అధికారులు విచారణ చేస్తారని చెప్పారు.

టైరు పగిలి మినీ లారీ బోల్తా.. ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

గ్రానైట్ పాలిష్ రాళ్లతో అద్దంకి నుంచి సంతమాగులూరు వెళ్లే రోడ్డు మార్గంలో టైరు పగిలి మినీ లారీ బోల్తా కొట్టిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు.. మండలంలోని గుంటుపల్లి పంచాయతీ కొత్తపాలెం గ్రామం పోలేరమ్మ దేవాలయం ఎదురు రోడ్డుపై గ్రోత్ సెంటర్ నుంచి నరసరావుపేట గ్రానైట్ పాలిష్ రాళ్లు తీసుకుని వెళ్లే మార్గంలో మినీ లారీ వెనక టైరు ఒక్కసారిగా పగిలిపోవడంతో మినీ లారీ రోడ్డుపై పడిపోయింది. ముప్పాళ్ల మండలం గొల్లపాడు గ్రామానికి చెందిన వాహనం నడుపుతున్న ఎస్‌కె రఫీ 40 సంవత్సరాలు తండ్రి సైదులు లారీలో నుంచి కింద పడిపోవడంతో రోడ్డుకు తగిలి తలకు బలమైన గాయం అయ్యింది. ప్రమాదాన్ని గమనించిన స్థానిక గ్రామస్తులు క్షతగాత్రుడిని ఆటోలో గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ రోడ్డు మార్గంలో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఈ ప్రమాదం చోటు చేసుకున్న సందర్భంగా అటుగా ఏ వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



ప్రమాదంలో గాయపడిన పూర్ణచంద్రరావు

ఆటోను ఢీకొన్న ద్విచక్రవాహనం

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-అద్దంకి

బస్సు ఆటోలను ద్విచక్ర వాహనదారుడు అధిగమించబోయిన క్రమంలో వాహనాన్ని నియంత్రించలేక ఆటోను ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైన ఘటన శుక్రవారం మండలంలోని చక్రాయపాలెం గ్రామ సమీపంలోని నామ్ ఎక్స్‌ప్రెస్‌వే రోడ్డుపై జరిగింది. అద్దంకి పట్టణం నుంచి మండలంలోని శ్రీనివాసనగర్ గ్రామానికి బైలడుగు పూర్ణచంద్రరావు, మద్దికట్ల రామయ్య కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో చక్రాయపాలెం గ్రామం వద్ద ఆర్టీసీ బస్సు ప్రయాణికులను ఎక్కించుకునే సమయంలో నిలిచిఉంది. ఈ సమయంలో ఒక ఆటో బస్సును అధిగమించే క్రమంలో ద్విచక్ర వాహనదారుడు కూడా అధిగమిస్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. స్థానికులు క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పూర్ణచంద్రరావును మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.



రామకూరులో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-పంగులూరు

క్షణికావేశంలో భార్యను చంపి, తన బిడ్డలను దిక్కులేని వారిని చేశానని మనస్థాపంతో, ఒక వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి మండలంలోని రామకూరు గ్రామంలో జరిగింది. రేణింగవరం ఎస్ఐ కేకే తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. రామకూరు గ్రామానికి చెందిన పావులూరి లక్ష్మీనారాయణ(34) కుటుంబ కలహాల నేపథ్యంలో, తన భార్య నాగసునీతను ఐదు నెలల క్రితం గొంతు నులిమి హత్య చేశాడు. తన భార్యను చంపిన హత్య కేసులో సుమారు మూడు నెలల పాటు రిమాండ్‌లో ఉండి ఇటీవల బయటకు వచ్చాడు. క్షణికావేశంలో తన భార్యను హత్య చేశానని, పిల్లలను చూసుకోవటం బాగా ఇబ్బందిగా ఉందని పలుమార్లు కుటుంబ సభ్యుల వద్ద ఆవేదన చెందినట్లు ఎస్ఐ తెలిపారు. పదేపదే భార్య గుర్తొస్తుండటంతో తీవ్ర మనస్థాపానికి గురై గురువారం రాత్రి రామకూరులోని తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతుడు లక్ష్మీనారాయణకు తొమ్మిది సంవత్సరాల అభిరామ్, ఏడు సంవత్సరాల విజయ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్ఐ తిరుపతిరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీ, లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఎదురెదురుగా వస్తున్న స్కూటీ, లారీ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరు గాయపడిన సంఘటన మండలంలోని చెంచుకుంట సమీపంలో శుక్రవారం జరిగింది. నంద్యాల జిల్లా శ్రీశైలానికి చెందిన టి రాజా, వి నరసింహులు స్కూటీపై ఆత్మకూరు వెళ్లి తిరిగి శ్రీశైలంకు బయలుదేరారు. ఇదే క్రమంలో దోర్నాల నుంచి ఆత్మకూరుకు వెళ్తున్న లారీ చెంచుకుంట సమీపంలో ఢీకొన్నాయి. దీంతో రాజా(20) అక్కడికక్కడే మృతి చెందాడు. నరసింహులుకు తీవ్ర గాయాలతో పాటు కాలు విరిగింది. 108 సహాయంతో క్షతగాత్రుడ్ని దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట తరలించారు. ఎస్ఐ అంకమరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన రాజా

వారాబందీ విధానంలో సాగునీరు ఇవ్వాలి

వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లాలో వ్యవసాయానికి వారాబంధి విధానంలో సాగునీరు సరఫరా చేయాలని కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సాగు చేస్తున్నందున చివరి భూములకు సాగునీరు అందించాలన్నారు. రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం సంక్షేమ పదకాలు అందించాలని అన్నారు. సెప్టెంబర్10లోగా ఈ క్రాప్ నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలన్నారు. సిసిఆర్‌సి కార్డులు ఉన్నవారికి పంట రుణాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. పంట పొలాలకు సాగునీటి సరఫరా ఇబ్బంది లేకుండా కాలువల మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పంటలకు పురుగు మందుల బదులు కషాయం వినియోగించడానికి మండలానికి ఒక తయారీ యూనిట్ ను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. తక్కువ వర్షపాతం నమోదైన మండలాల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసుకొనే విధంగా రైతులను ప్రోత్సాహించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దశరథ మహారాజు, వ్యవసాయ శాఖ జెడి అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జెడి హనుమంతరావు, మత్స్యశాఖ జెడి సురేష్, ఏపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణ, ఉద్యాన వన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జెనెమ్మ, పౌర సరఫరాల శాఖ డిఎం శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి రంజిత్ బాషా

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని జిల్లాలో తొలిసారి కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో శుక్రవారం ఆయన ప్రారంభించారు. 11మంది ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు కలెక్టర్‌కు అందజేశారు. సమస్యలు సావధానంగా విన్న ఆయన తక్షణమే పరిష్కార మార్గం చూపారు. ప్రతినెల 3వ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ సెల్ తప్పనిసరిగా నిర్వహిస్తామని ప్రకటించారు. ఏపి రెవిన్యూ అసోసియేషన్ కార్యాలయ భవనం కొరకు స్థలం కేటాయించాలని, కలెక్టరేట్ ఉద్యోగుల కొరకు క్యాంటిన్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని, ఏపి రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ సురేష్ బాబు, ప్రధానకార్యదర్శి బి ఓంకార్, టౌన్ యూనిట్ అధ్యక్షులు ఎస్‌కె మహబూబ్ బాషా కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె లక్ష్మీశివజ్యోతి, కలెక్టరేట్ ఏఓ కె గోపికృష్ణ పాల్గొన్నారు.


మహాశక్తి క్యాంపెయిన్ చేస్తున్న తెలుగు మహిళలు

టిడిపి మహాశక్తి క్యాంపెయిన్

ప్రజాశక్తి - భట్టిప్రోలు

టిడిపి మహానాడులో అధినేత చంద్రబాబు ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారంటీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించేదుకు చేపట్టిన మహాశక్తి క్యాంపెన్ శుక్రవారం భట్టిప్రోలులో నిర్వహించారు. బాపట్ల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఛందోలు పుష్పలత మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి పాలనలో రాష్ట్రం అధోగతి పట్టిందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు సిఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు చెప్పారు. తల్లికి వందనం, ఆడబిడ్డకు నిధి, దీపం పథకం, మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తునుగుంట్ల సాయిబాబా, కుక్కల వెంకటేశ్వరరావు, కరుణ శ్రీనివాసరావు, బట్టు మల్లిఖార్జునరావు, సుందరరావు, రాయన ప్రసాద్, మాచర్ల నాగరాజు, వామనపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పాలేటి

డాక్టర్ పాలేటి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని కొత్తపేట సంపత్ నగర్ కాలనీలో మాజీమంత్రి డాక్టర్ పాలేటి రామారావు కార్యకర్తలతో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తాను పోటీలో ఉంటానని చెప్పారు. తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ డాక్టర్ పాలేటి ఎంఎల్ఏగా పనిచేసిన కాలంలో సంపత్ నగర్ కాలనీలో ఇళ్లకు ఒటిఎస్ పథకం ద్వారా ఇళ్ల పట్టాలు ఇప్పించారని గుర్తు చేశారు. సంపత్ నగర్ కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణం చేశారని అన్నారు. బైపాస్ నిర్మాణంతో సంపత్ నగర్ కాలనీలో ఇళ్లకు విలువ పెరిగిందని అన్నారు. వృద్దులకు, వితంతువులకు పింఛన్లు మంజూరు చేయించారని అన్నారు. ఆరోగ్య శ్రీ లేని రోజుల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సిఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం చేశారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికలలో తాము డాక్టర్ పాలేటి వెంటే నడుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కటకం శ్రీనివాసరావు, షేక్ హుమాయూన్ భాష, షేక్ అమిరుద్దీన్, షేక్ గౌస్ బాబు, షేక్ కరీముల్లా, జిలాని, మారుబోయిన శ్రీనివాసరావు, గోపీచంద్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమవుతున్న జగనన్న కాలనీ

నేడు కలెక్టర్ రంజిత్ బాషా పరిశీలన

ప్రజాశక్తి వేటపాలెం

బాపట్ల జిల్లాలో మొట్టమొదటిసారిగా జగనన్న కాలనీ ప్రారంభోత్సవానికి వేటపాలెంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. చల్లారెడ్డిపాలెం కొంజేటి నగర్‌లో జగనన్న కాలనీ ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. హౌసింగ్ పీడీ కెవిఎస్ ప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి, మండల ప్రత్యేక అధికారి జె రాజదేబోరా కాలనీ నిర్మాణాన్ని శుక్రవారం పరిశీలించారు. ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో సమీక్ష చేశారు. పీడీ కెవిఎస్ ప్రసాద్ మాట్లాడు తూ జగనన్న కాలనీ ప్రారంభానికి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ నెలాఖరికి మంత్రుల ఆధ్వర్యంలో ప్రారంభోత్సవాలు జరపాల్సి ఉందని అన్నారు. 270 ఇళ్లకు 204 గృహాలు పూర్తయ్యాయని అన్నారు. కలెక్టర్ రంజిత్ భాష కాలనీలో గృహ నిర్మాణాలను శనివారం పరిశీలిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల, పర్చూరు హౌసింగ్ డీఈలు గోవిందరెడ్డి, ఎస్ మురళి, పంచాయతీరాజ్ డిఈ స్వర్ణ శేషయ్య, ఎంపీడీవో కె నేతాజీ, తాసిల్దార్ యు అశోక్ వర్ధన్, ఏఈలు సుబ్బారావు, శ్రీనివాసరావు, భాషా, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ పి రామకుమార్, పందిళ్లపల్లి, రామన్నపేట కార్యదర్శులు పి శారద, బి సురేంద్ర పాల్గొన్నారు.


కాలనీ పనులు పరిశీలిస్తున్న పిడి

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

పోలీసు గ్రీవెన్స్‌డేలో బాపట్ల ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

నిత్యం ప్రజా సేవలో నిమగ్నమై ఉండే పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. పోలీస్ సిబ్బంది శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే ఎస్‌పి నిర్వహించారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో, ఇతర విభాగాలలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది వారికున్న శాఖాపరమైన, వ్యక్తిగత సమస్యలను ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. గ్రీవెన్స్–డేలో 92 మంది పోలీస్ సిబ్బంది సమస్యలు చెప్పుకున్నారు. వారి సమస్యలను కూలంకషంగా ఎస్‌పి విన్నారు. పరిశీలించి సత్వర పరిష్కారంకు అవకాశం వున్న సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణకై పాటుపడుతూ నిత్యం ప్రజా సేవలో నిమగ్నమై ఉండే పోలీసు సిబ్బంది సమస్యలను తెలుసుకొని వాటిని సత్వరమే పరిష్కారానికి ప్రతి నెలా ఒక రోజు గ్రీవెన్స్–డే నిర్వహిస్తున్నామని అన్నారు. పోలీసు సిబ్బంది పోలీస్ గ్రీవెన్స్–డేను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ ఏ శ్రీనివాస్, డిపిఓ ఏ సెక్షన్ సూపరింటెండెంట్ షేక్ కరిముల్లా, కాలిషావలి, డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.


గ్రీవెన్స్‌డేలో సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్‌పి

వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - చీరాల

సహాయ బిసి సంక్షేమ కార్యాలయంలో వాచ్ మాన్‌గా పనిచేస్తున్న ఎపి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు దుడ్డు వెంకటేశ్వర్లును 4వ తరగతి ఉద్యోగులు శుక్రవారం సన్మానించారు. కలెక్టర్ రంజిత్ భాష చేతులమీదుగా ఉత్తమ సేవా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఎబిసిడబ్ల్యుఓ రాజేష్‌దాసు, జెఎసి టిసిహెచ్ సోమశేఖర్, ఎఎస్‌డబ్లుఓ సైదారెడ్డి, జెఎసిటి ఎం శ్రీనివాసులు, ఎం సుందరరావు, టి అబ్రహం, టి పాల్, టి సుబ్బారావు, డి సులోచన, కె లైమన్, బి రాజేశ్వరిదేవి సన్మానించారు.

ప్రజా శాంతికి భంగం కలిగిస్తే చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లాలో శనివారం వివిధ పంచాయతీల్లో ఉప ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారికేట్లు ఏర్పాటుపై సమీక్షించారు. సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాల వద్ద ఎక్కువ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్‌కు అవాంతరాలు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. అద్దంకి, మార్టూరు, ఎల్చూరు రాష్ట్ర రహదారి ప్రమాదాలపై పోలీసు, ఆర్‌అండ్‌బి, రవాణా అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. అద్దంకి పట్టణంలో తోపుడు బండ్లు వ్యాపారుల వల్ల రోడ్డు ఇరుకై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. చీరాల, వేటపాలెం మధ్యలో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఆదనవు ఎస్‌పి మహేష్, జిల్లా రవాణా శాఖ అధికారి ఏ చంద్రశేఖరరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, ఆర్‌అండ్‌బి ఎస్ఇ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర జయప్రదం చేయాలి : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టరు పి రంజిత్ బాషా తెలిపారు. వార్షిక ప్రణాళికపై క్రీడాప్రాధికార సంస్థ, స్టెప్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అక్టోబరు 2నుంచి 36 రోజులు పాటు వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాట్మింటన్, క్రికెట్ క్రీడలను జరపాలన్నారు. క్రీడాప్రాంగణాలను ఎంపిక చేసి జాబితా పంపాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో విజేతలకు ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.30వేలు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో స్టెప్ సిఇఒ ఎస్ పల్లవి, జిల్లా చీఫ్ కోచ్ కె పాల్, వాలీబాల్ కోచ్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

అంబేద్కర్ వాదులతో చర్చించాకే పనులు చేయాలి

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని ముక్కోణం పార్కు (డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సర్కిల్) వద్ద అంబేద్కర్ సర్కిల్‌లో దళిత, ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నూతనంగా చేపడుతున్న అంబేద్కర్ కాంస్య విగ్రహం నిర్మాణం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో చెప్పాలని డిమాండ్‌చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ముక్కోణం పార్క్ వద్ద చేపడుతున్న అంబేద్కర్ కాంస్య విగ్రహ పనులను అధికారులు ప్రజా విరుద్ధంగా చేపడుతున్నారని ఆరోపించారు. ప్రజలు ఆరాధ్య దైవంగా భావించే అంబేద్కర్ విగ్రహాన్ని కనీసం ఏ ఒక్కరికి తెలియజేయకుండా అధికారులు ఇష్టానుసారంగా తొలగించి ప్రజల మనోభావాలను దెబ్బతీశారని అన్నారు. కనీసం అంబేద్కర్ అంటే అవగాహన లేని, రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులను నిర్మాణ కమిటీలో చేర్చడం సిగ్గుచేటుగా ఉందన్నారు. అసలు కాంస్య విగ్రహం రూపాన్ని, ప్లానింగ్, నమూనాలను దళిత, ప్రజాసంఘాలు కోరినా ఇవ్వకుండా కౌన్సిల్ ఏకపక్ష నిర్ణయంతో అధికారులు చేపడటం దుర్మార్గపు చర్యని ఆరోపించారు. వెంటనే పనులను నిలువుదల చేసి దళిత, ప్రజాసంఘాల సలహాలను, సూచనలు పరిగణలోకి తీసుకోని కోరారు. ప్రజల సమన్వయంతో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. లేకుండా అధికారులకు భారీ మూల్యం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి ఏసురత్నం, సిపిఎం కార్యదర్శి ఎన్ బాబూరావు, క్రిస్టియన్ వాయిస్ ప్రతినిధి నీలం శామ్యూల్‌మోజెస్, బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొర్రెపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నేతలు

ప్రజాశక్తి 5
శనివారం 19 ఆగస్టు 2023

వేతన ఒప్పందాన్ని పున:సమీక్షించాలి

- స్ట్రగుల్ కమిటీ డిమాండ్
- విద్యుత్ భవన్ వద్ద స్ట్రగుల్ కమిటీ నిరసన



నిరసన తెలియజేస్తున్న విద్యుత్ ట్రేడ్ యూనియన్ కమిటీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విద్యుత్, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు నిర్ణయించిన వేతన ఒప్పందాన్ని పున: సమీక్షించుకోవాలని స్ట్రగుల్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఏపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ, రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం ఒంగోలు విద్యుత్ భవన్ వద్ద స్థానిక స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నిరసన తెలియజేశారు. కార్యక్రమానికి స్ట్రగుల్ కమిటీ చైర్మన్ జి.వి.రాగయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యుత్ వేతనసవరణ ఒప్పందాన్ని ఏపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ ఒప్పందం ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు తీవ్ర నిరాశ మిగిల్చిందన్నారు. ఈ ఒప్పందాన్ని పూర్తిగా నిలుపుదలచేసి, వేతనసవరణ పై పున: సమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ, విద్యుత్ సంస్థలో 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉంటే వారి ప్రతినిధి నిర్ణయాలలో లేకుండా, వారి వేతన అగ్రిమెంట్ ఎలా చేస్తారని ప్రశ్నించారు. 2018 సంవత్సరంలో వేతనాలపై "2 "శాతం మాత్రమే పెంచి 37శాతం పెంచామని ప్రకటించటం నీచమైన చర్యగా తెలిపారు. విద్యుత్ సంస్థలో జరిగిన వేతనసవరణ చట్టబద్ధం కాదని, చీకటి ఒప్పందంగా ఉందని తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి బాధ్యత వహించి విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు న్యాయమైన వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కార్మికుల పోరాటానికి జాతీయ కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల మద్దతు కూడగట్టి, కార్మికుల వేతన సవరణ పరిష్కారంతో పాటు, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిన అవసరం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ కోశాధికారి కె.పాపారావు, దేపూరి శ్రీనివాసరావు, కందిమళ్ల శివ, చెన్నుపాటి కోటేశ్వరరావు, పి.బాలు, నాగార్జున, విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను ధ్వంసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్నకుమార్

ప్రజాశక్తి-చీమకుర్తి

రాష్ట్ర ప్రభుత్వం పథకాల పేరుతో ఆర్భాటపు ప్రచారం చేస్తుందని, ఆచరణలో ప్రభుత్వ విద్యను ధ్వంసం చేస్తుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె. ప్రసన్నకుమార్ తెలిపారు. స్థానిక దాచూరి రామిరెడ్డి భవనంలో ఎస్ఎఫ్ఐ ప్రకాశం జిల్లా ప్లీనరీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె. విజయ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రాథమిక విద్యను నూతన విద్యావిధానం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఎయిడెడ్ విద్యా విధానాన్ని రద్దు చేసి ఇంటర్ విద్యను పేదలకు దూరం చేసిందన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన పథకాలతో విద్యార్థులపై ఫీజుల భారాన్ని మోపిందన్నారు. జీవో నంబర్ 77 తీసుకొచ్చి ఉన్నత విద్యకు రీయింబర్స్‌మెంట్ రద్దు చేసి పేదలకు విద్యను దూరం చేసిందన్నారు. ప్రకాశం జిల్లా యూనివర్సిటీ ,ట్రిపుల్ ఐటీలకు నిధులు కేటాయించలేదన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్ మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ అభివృద్ధి కోసం ఉద్యమాలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని తెలిపారు. సంక్షేమ హాస్టళ్ళ వైసిపి ప్రభుత్వ హయాంలో మూసివేతకు దగ్గర పడ్డాయన్నారు. సమావేశంలో గత కార్యక్రమాలను సమీక్షించుకుని కర్తవ్యాలు రూపొందించుకుని ముందుకు సాగనున్నట్లు తెలిపారు.

సేవా దృక్పథంతో పనిచేయండి

కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్



ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వ సర్వీసులలో ఉన్న వారు చిత్తశుద్ధితో, సేవా దక్పథంతో పనిచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఏపిపిఎస్‌సి ద్వారా జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ అసిస్టెంట్ వంటి గ్రూప్-4 ఉద్యోగాలకు ఎంపికైన 52 మందికి శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన హాలులో నియామక పత్రాలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలలో నెగ్గి ప్రభుత్వ ఉద్యోగులుగా ఎంపికైన యువత విధులు నిర్వహణలోనూ అదే స్ఫూర్తితో పనిచేయాలని వారికి దిశా నిర్దేశం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, కేటాయించిన విధులపైనా అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి ఆర్. శ్రీలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : బాలినేని



పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. తొలుత 19వ డివిజన్‌లోని జడ్‌పి మీటింగ్ హాలు నుంచి కాసు బ్రహ్మానందరెడ్డి విగ్రహం వరకు రూ.40లక్షల వ్యయంతో పూర్తి చేసిన రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు. అదే డివిజన్‌లోని భాగ్యనగర్, హౌసింగ్ బోర్డు కాలనీలలో రూ.20 లక్షలతో మురుగు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గుత్తి కొండవారి పాలెం డంపింగ్ యార్డు వద్ద 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5.27 కోట్లతో ఏర్పాటు చేసిన లెగసి వేస్ట్, బయో మైనింగ్ ప్లాంట్ యూనిట్‌ను ప్రారంభించారు. కొత్త కూరగాయల మార్కెట్‌లో రూ.9.50లక్షతో నిర్మించిన ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఇస్లాంపేటలో రూ.40లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాలు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే ప్రాంతంలో రూ.16లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఐదో డివిజన్‌లో రూ.3లక్షలతో ఏర్పాటు చేయనున్న పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. అనంతరం ఐదో డివిజన్ గోపాలనగర్ ప్రాంతంలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలలో నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, ఒడా చైర్మన్ శింగరాజు మీనా కుమారి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇంజినీర్ మాల్యాద్రి, డిఇఇ గణపతి, పద్మజ, కార్పొరేటర్లు ఈదర వెంకట సురేష్‌బాబు,య షేక్ నూర్జహాన్, బేతంశెట్టి శైలజ, ఎందేటి పద్మావతి, శాండిల్యా, తాడి కృష్ణలత, వెన్నపూస శోభారాణి, చింతపల్లి గోపి, చల్లా తిరుమలరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పొన్నూరుకు ఎస్‌వి.రంగారావు పురస్కారం



పొన్నూరు వెంకట శ్రీనివాసులు

ప్రజాశక్తి- ఒంగోలు

పద్మశ్రీ ఘంటసాల, మొవ్వ సీతారామయ్య-బసవమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20న సివిఎన్ రీడింగ్ రూమ్‌లో సినీ సంగీత విభావరి, ఎస్‌విఆర్, ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు మొవ్వ నాగేశ్వరరావు ప్రసంగ ప్రధాన కార్యదర్శి యత్తప్పు కొండారెడ్డి, కోశాధికారి కె.వి.రమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, సుమధుర సాహితీభూషణ పొన్నూరు వెంకట శ్రీనివాసులకు విశ్వనట చక్రవర్తి ఎస్‌వి.రంగారావు పురస్కారం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పొన్నూరు సాహిత్య రంగంలో మూడు దశాబ్దాలకు పైగా విశేషమైన కృషి చేస్తూ చిత్రకారుడిగా, నటుడిగా, వ్యాఖ్యాతగా, ఉపన్యాసకుడిగా, కవిగా, రచయితగా, ఆధ్యాత్మిక ప్రవచన కర్తగా బహుముఖ ప్రజ్ఞకు గుర్తింపుగా ఈ పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు.

దాడుల ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి

టంగుటూరు : జిల్లాలో దాడుల ఘటనలు పునరావతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని అంబేద్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో కలెక్టర్, ఎస్పీలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎస్పీ మలిక గర్గ్‌లను అంబేద్కర్ ఇండియా మిషన్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల దర్శి మండలం బొట్లపాలెం గ్రామంలో దళిత కుటుంబం పై జరిగిన అమానుష దాడి ఘటనను వారు కలెక్టర్, ఎస్పీలకు వివరించారు. స్పందించిన కలెక్టర్, ఎస్పీలు విచారణ చేసి బాధితులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్టు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్ రాష్ట్ర అధ్యక్షులు, ఐపిఎస్ పీవీ సునీల్ కుమార్, జోనల్ ఇన్చార్జి, జీఎస్టీ రాష్ట్ర ఉప కమిషనర్ యన్నం వెంకటేశ్వర్లు, ఎయిమ్ న్యాయ సలహాదారుకరవది అనిల్ పాల్గొన్నారు.

హాసినికి అభినందనలు



మామిళ్లపల్లి హాసిని

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలం కట్టావారిపాలెం గ్రామానికి చెందిన మామిళ్లపల్లి హాసిని గ్రూప్-1 ఫలితాల్లో విజయం సాధించింది. వివరాల్లో వెళ్లగా కొండపి పంచాయతీ పరిధిలోని కట్టావారిపాలెం గ్రామానికి చెందిన మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు కుమార్తె మామిళ్లపల్లి హాసిని గురువారం నాడు విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో సెక్రటరి ఇన్ మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్లో విజయం సాధించింది. గత నాలుగు సంవత్సరాల నుంచి తూర్పు గోదావరి జిల్లా అడ్డతీగల(రంపచోడవరం)లో ఏటిడబ్ల్యూ(ట్రైబల్ వెల్ఫేర్ అధికారి)గా పనిచేస్తున్న హాసిని గ్రూప్-1లో విజయం సాధించింది. హాసిని తండ్రి మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు కొండపి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. విడుదలైన మొత్తం 111 పోస్టులకుగాను, ఒక పోస్టు మారుమూల ప్రాంతానికి చెందిన హాసిని సాధించడం గొప్ప విషయం అని అన్నారు. గ్రూప్-1 సాధించిన హాసిని కొండపి మండల నాయకులు, అధికారులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలంలోని కొర్రపోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కొర్రపోలు గూడెంలో డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఉద్దేశించి డాక్టర్ వైయస్ఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గూడాల్లోని చెంచు గిరిజనులు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం పరుచుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరానికి ఒంగోలు నుండి విజయ నర్సింగ్ హోమ్ వైద్యులు, వెంకట రమణ నర్సింగ్ హోమ్ వైద్యులు పాల్గొని మొత్తం 212 మంది రోగులను పరీక్షించి వారిలో 6 మందిని మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేయడం జరిగిందని తెలిపారు. శిబిరంలో డాక్టర్ వైఎస్ఆర్ జిల్లా మేనేజర్ కిరణ్ కుమార్, కొర్రపోల్ సర్పంచ్ మొద్దు తిరుపతయ్య, హాస్పిటల్ వైద్యాధికారులు డాక్టర్ శంకర్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీనారాయణ, టీం లీడర్లు హబీబ్లా, వెంకట్రావు, ఆరోగ్య మిత్రలు మందగిరి చంద్రశేఖర్, దర్శనం రాంబాబు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడుగుజాడలు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఇస్లాం వాద రచయిత్రి ఖుర్షిద్‌బేగం రాసిన ఇస్లాం వాద కథల పుస్తకం అడుగుజాడలు పుస్తకాన్ని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శుక్రవారం అంబేద్కర్ ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ఖుర్షిద్ కథలు సమాజానికి మేల్కొలుపు కావాలని తెలిపారు. నేడు కనుమరుగవుతున్న నైతిక విలువలను అందించడంలో ఈ పుస్తకం మంచి పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఇలాంటి పుస్తకాలు మరెన్నో సమాజానికి అందించాలని రచయిత్రి ఖుర్షిద్‌బేగంను కోరారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, మండల సచివాలయ కన్వీనర్ ఎస్ఎం జబివుల్లా, ఇస్లాం వాద రచయిత్రి ఖుర్షిద్‌బేగం తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న మంత్రి సురేష్



ఎస్‌పి మల్లికగర్గ్‌కి పుష్పగుచ్ఛం ఇస్తున్న సిఐ

ఎస్‌పి ను కలిసిన సిఐ భక్తవత్సలరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

సాధారణ బదిలీలో భాగంగా నరసరావుపేట రూరల్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ పి. భక్తవత్సల రెడ్డి ప్రకాశం జిల్లా ఒంగోలు తాలూకా సీఐగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సీఐ ఒంగోలు తాలూకా పియస్‌లో రిపోర్ట్ చేస్తుకున్న అనంతరం శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మల్లిక గర్గ్‌ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

వివాహ వేడుకల్లో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-దరిశి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీదేవి, యుటిఎఫ్ నాయకులు హనుమంతారెడ్డి కుమార్తె వివాహ వేడుకలలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. దరిశిలోని టీచర్స్ కాలనీలో యుటిఎఫ్ నాయకులు మారం హనుమంతారెడ్డి కుమార్తె వివాహ వేడుకలలో తాళ్ళూరు జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి, దరిశి కౌన్సిలర్ విసిరెడ్డి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ధనిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు కామిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, రామ్మోహన్, శ్రీను, కాశం తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో వర్గ పోరు

పామూరు : పామూరు మండలంలో వైసిపిలో వర్గపోరు జోరు అందుకుంది. మొదటి నుండి పార్టీని నమ్ముకుని జెండా మోసిన నాయకులకు పార్టీలో ప్రాధాన్యత లోపించిందని చెప్పవచ్చు. సీనియర్ నాయకులు ప్రస్తుతం రెడ్డికార్పోరేషన్ ఛైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి గూటికి మెల్లగా చేరుకుంటున్నారు. ప్రస్తుతం పంచాయతీ సర్పంచ్‌లు బాధలు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి సర్పంచ్‌గా గెలిస్తే వాలంటరీలకు ఉన్న గౌరవం సర్పంచ్‌కు లేదని,. పేదలకు ఇంటి పట్టాలు తెప్పించుకోలేకపోతున్నామని దూబగుంట ఉపసర్పంచ్ కందుల శ్రీనివాసరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దూబగుంట్ల ప్రాంతానికి వచ్చిన ట్రిబుల్ ఐటి బుర్రా మధుసూధన్‌యాదవ్ గెలవడంతో వెనుకబ పోయిందని ఆప్రాంత ప్రజలు మండల ప్రజలు ఆశలు నిరాశగా మారిన విషయం తెలిసిందే. సీనియర్ నాయకులు అంబటి కొండారెడ్డి, అంచూరి సత్యంరెడ్డి, కె రామిరెడ్డి, అనంతరెడ్డి ఇలాంటి నాయకులు చింతలచెరువు సత్యనారాయణరెడ్డి గ్రూపులో ఉన్నారు. మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ దారపనేని చంద్రశేఖర్ రాబోయే ఎన్నికలలో కదిరి బాబూరావుకు సీటు ఖాయమని వారి గెలుపుకు నావంతు కృషి ఉంటుందని విలేకర్ల ముందు తెలిపారు. ఇది పట్టణంలో సవాల్‌గా ఉన్నదని రోజురోజుకు రాజకీయం వేడెక్కుతుంది.

మొక్కుబడిగా మండల సమావేశం

కొనకనమిట్ల : మూడు నెలలకు ఒక పర్యాయం ఎంతో ప్రతిష్టాత్మకంగా జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించటం ఎవరికి ప్రయోజనమని మండల రెండవ ఉపాధ్యక్షులు మెట్టు వెంకటరెడ్డి అధికారులను నిలదీశారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మూరబోయిన మురళీకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మెట్టు వెంకటరెడ్డి మాట్లాడుతూ ఏజెండా ఏమిటో సభ్యులకు ముందస్తుగా తెలపకుండా సమావేశాన్ని ఎలా నిర్వహిస్తారని ఇన్‌చార్జి ఎంపిడిఒ రావూరి జనార్ధన్‌ను ప్రశ్నించారు. గతంలో జరిగిన సమావేశాల్లో సభ్యులు అడిగిన సమస్యలను ఎన్ని పరిష్కరించారు, ఎన్ని పరిష్కారం కాలేదనే నివేదిక మీ దగ్గర ఏమైనా ఉందా ఉంటే తెలియజేయాలని పట్టుబట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన మురళీకృష్ణ జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు మండల ఉపాధ్యక్షులు మెట్టు వెంకటరెడ్డి, జెనీఫా, ఇన్‌చార్జి ఎంపిడిఒ రావూరి జనార్ధన్, మాజీ ఎంపీపీ రామనారాయణరెడ్డి, పిఆర్, విద్యుత్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు

- ఏఎస్ దినేష్ కుమార్
- అధికారులకు కలెక్టర్ సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కేంద్రీయ విద్యాలయంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్, విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ (విఎంపి) ఛైర్మన్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక భాగ్యనగర్‌లోని కేంద్రీయ విద్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన విఎంసి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకడమిక్, మౌలిక సదుపాయాలపై ఈ సమావేశంలో సమీక్షించామన్నారు. విద్యాలయంలో అన్ని సబ్జెక్టులకు కలిపి సాధిస్తున్న సగటు మార్కులు 63 శాతంగా ఉన్నట్లు తెలిపారు. ఇంగ్లీష్, హిందీ, గణితంలో ఈ సగటు 50 శాతం కంటే తక్కువగా ఉందన్నారు. వీటిని మెరుగుపరిచి ఈ విద్యా సంవత్సరంలో ప్రతి సబ్జెక్టులోనూ విద్యార్థులందరూ కనీసం 60 శాతం మార్కులు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టి బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించామన్నారు. పాఠశాలకు అవసరమైన కంప్యూటర్లను ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి తన ఎంపి నిధులతో సమకూర్చుస్తానని చెప్పినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పాఠశాల ప్రాంగణం పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని కూడా విద్యార్థులకు ఆట స్థలం కోసం కేటాయించడానికి పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపల్ బిఎస్‌పి రావు, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ పి.ప్రకాష్ బాబు, డిఎం,హెచ్ఒ డాక్టర్ ఎస్. రాజ్యలక్ష్మి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సర్పంచి ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి : పాకల

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలంలో శనివారం జరుగు గ్రామ పంచాయతీ ఎలక్షన్‌కి అధికారులు అన్ని సిద్ధం చేసుకొని ఉన్నారు. పాకల గ్రామపంచాయతీ సర్పంచ్ ఉపఎన్నికతో పాటు శింగరాయకొండ గ్రామపంచాయతీలోని 16వ వార్డు నెంబర్‌కి, మూలగుంటపాడు గ్రామపంచాయతీలోని 10వ వార్డు నెంబర్ కూ శనివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో. శుక్రవారం ఆ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్.జమీఉల్లా ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చి బస్సుల్లో బాక్సులను పోలింగ్ బూతులు వద్దకు చేర్చడం జరిగింది. ఎన్నికల సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చి పంపించడం జరిగింది. శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ టి.శ్రీరామ్ ఆధ్వర్యంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం వద్ద ఎన్నికల డ్యూటీకి వచ్చిన పోలీసులకు శిక్షణ ఇచ్చారు. ఈ ఎలక్షన్‌కు ఒంగోలు డిఎస్పి నారాయణస్వామిరెడ్డి పర్యవేక్షణలో ముగ్గురు సిఐలు, 11 మంది ఎస్ఐలు, 155 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఇప్పటికే పాకల ఎన్నికల విషయంలో వైసీపీ, టిడిపి మధ్య గొడవలు జరిగిన నేపథ్యంలో పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భారీ పోలీసు బందొబస్తును ఏర్పాటు చేశారు. సిఐ దాచేపల్లి రంగనాథ్ ఎస్సై శ్రీరామ ఆధ్వర్యంలో పోలీసులకి శిక్షణ ఇచ్చి ఆ గ్రామాలకు పంపించారు.

డబ్బులు పంపిణీ - సర్పంచ్‌కు రూ.300, వార్డు మెంబర్‌కు రూ.500 :

శింగరాయకొండ మండలంలోని పాకల సర్పంచి ఎలక్షన్. మూలగుంటపాడులోని 10వ వార్డు నెంబర్ ఎలక్షన్ శింగరాయకొండలోని 16వ వార్డు నెంబర్ ఎలక్షన్‌లో డబ్బుల ప్రవాహం జోరుగా సాగుతుంది. రెండు పార్టీలు సర్పంచ్ అభ్యర్థుల కోసం రూ.300లు చొప్పున ఓటర్లను కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తుంది. శింగరాయకొండ గ్రామపంచాయతీలోని 16వ వార్డు నెంబర్ పరిస్థితి కూడా జనసేన, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మధ్య పోటీ ఉండడంతో ఇరుపార్టీల నాయకులు వార్డు నెంబర్ను తెలుసుకునేందుకు రూ.500లు చొప్పున ఓటర్లను కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తుంది. సర్పంచ్ అభ్యర్థులు గెలుపు కోసం రూ.300లు చొప్పున ఓట్లు కొనుగోలు చేస్తుంటే వార్డు నెంబర్లు గెలుపు కోసం ఓటు రూ.500 చొప్పున కొనుగోలు చేయటం ఇక్కడ పోటీ ఏవిధంగా ఉందో అర్థం అవుతుంది.

రాచర్ల ఆరవ వార్డు, సిఎస్‌పురం ఆరవ వార్డు ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి:

రాచర్ల మండలం రాచర్ల గ్రామపంచాయతీ ఆరవ వార్డు సభ్యులు ఎన్నికలు నేడు రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగనున్నాయి. ఈ వార్డులో 283 ఓట్లు ఉన్నాయి. వైసిపి తరపున షేక్ హజర్బీ, టిడిపి తరపున షేక్ అనీరున్నీశాలు పోటీలో ఉన్నారు. ఎన్నికలు ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతాయి. మధ్యాహ్నం రెండు గంటల నుండి కౌంటింగ్ జరుగుతుంది. ఎన్నికలకు ప్రొసీడింగ్ అధికారిగా ఉపాధ్యాయులు ఎన్ శివకుమార్, రిటర్నింగ్ అధికారిగా ఉపాధ్యాయులు ఎస్కే మహమ్మద్ రఫీ, రూట్ ఆఫీసరుగా పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర నాయక్, ఎన్నికల అధికారిగా ఎంపీడీవో కే కవితా చౌదరిలు వ్యవహరించనున్నారు.

సిఎస్‌పురం రూరల్: మండల పరిధిలోని చెన్నపునాయకునిపల్లిలో 6వ వార్డు మెంబరు ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపిడిఒ డి.ఈశ్వరమ్మ తెలిపారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎంపిడిఒ శుక్రవారం పరిశీలించారు. ఈ వార్డు లో 122 మంది ఓటర్లు ఉన్నారు. ఐదుగురు అభ్యర్థులు పోటీల్లో ఉన్నారు.

పేదల వైద్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఏపీ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్ బాబు

సంతనూతలపాడు : ప్రభుత్వ వైద్యశాలలోనే మెరుగైన సేవలు అందుతున్నాయని, వైద్య సేవలు పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఏపీ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు అన్నారు. సంతనూతలపాడు మండలంలోని చిలకపాడు గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి 15 రోజులకు ఒకసారి 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వైద్య సదుపాయం అందుతుందా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఆయన స్వయంగా పరీక్షలు చేసి మందులను అందించారు. బిపి, షుగర్ ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి అవసరమైన రక్త పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. గ్రామంలోని గర్భిణులను వైద్యులు పర్యవేక్షిస్తూ వారికి ఆరోగ్యం పై అవగాహన కల్పిస్తూ వైద్యం అందిస్తారని, నార్మల్ డెలివరీకి ప్రాధాన్యత ఇస్తారని అన్నారు. 14 రకాల టెస్టులను చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, డాక్టర్ బి. శ్రావ్య, 104 డివిజన్ మేనేజర్ కోటేశ్వరరావు, డీఈవో నాగేశ్వరరావు, ఏఎన్ఎం సరిత, ఎంఎల్ హెచ్పి ప్రవీణ, డ్రైవర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

కొండపి : మన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి పేదవారికి కార్పోరేట్ వైద్యం అందించే దిశగా ఆరోగ్యశ్రీ ఏర్పాటు చేశారని ఏపి ఆరోగ్య శ్రీ స్పెషల్ అధికారి డాక్టర్ యాదల అశోక్‌బాబు తెలిపారు. శుక్రవారం నాడు కొండపి మండలంలోని అనకర్లపూడి గ్రామానికి చెందిన దంతం మునలయ్య ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. దంతం మునలయ్య ఇంటికి వచ్చి డాక్టర్ యాదల అశోక్‌బాబు పరామర్శించారు. పేదవారి ఆరోగ్యానికి మన రాష్ట్ర ముఖ్యమంత్రి భరోసా కల్పిస్తూ పేదలందరికి అండగా ఉన్నారని తెలిపారు. ఆయన వెంట ఏపి ఆరోగ్య శ్రీ స్పెషల్ అధికారి పిఎ కృష్ణబాబు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే

కొండపి : కొండపి మండలం పెదకండ్లగుంట పంచాయతీ పరిధిలోని జాళ్లపాలెం గ్రామానికి చెందిన బండి శివరామయ్య కుమార్తె హిమబిందు వివాహం కార్యక్రమానికి కొండపి శాసన సభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పాల్గొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బత్తుల నారాయణస్వామి, నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, తానికొండ వెంకటేశ్వర్లు, రెండవ కోటయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కొమరోలు : ప్రకృతి వ్యవసాయం సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని సిఆర్‌పిఎస్ కర్నాటి రమాదేవి తెలిపారు. మండల పరిధిలోని ద్వారకచర్ల గ్రామంలో ప్రకతి వ్యవసాయంపై వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకతి వ్యవసాయ ప్రతినిధి మద్దిరెడ్డి మాట్లాడుతూ దశపర్ణి కషాయం తయారీ గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు. **టంగుటూరు :** మండలంలోని కందులూరు గ్రామంలో రైతు సాధికార సంస్థ, నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో ప్రకతి వ్యవసాయం చేసే రైతులకు పథకంతో పాటు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రకతి వ్యవసాయానికి అవసరమయ్యే రూ.10వేలు విలువచేసే కిట్లను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానమంత్రి అభ్యుదయ పథకం యూనిట్ ఇన్చార్జి విజయలక్ష్మి, గ్రామ సర్పంచ్ పసుమర్తి ఈశ్వరమ్మ, గ్రామ సీనియర్ నాయకులు ఉప్పలపాటి రామరాజు, మన్నం వెంకయ్య, ఉప్పలపాటి సత్యనారాయణ రాజు, రామిశెట్టి దాసయ్య, పసుమర్తి ఆనంద్, ఆర్బీలు సుజాత, హరిత, మరియమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ బహూకరణ

పిసిపల్లి : మండలంలోని దివాకరపురం పాఠశాలకు నేరేడుపల్లికి చెందిన చవడం రవి రూ.10వేల విలువ చేసే వాటర్ కూలర్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా చవడం రవిని పలువురు అభినందించారు. దాతలు ముందుకు వచ్చి పేద విద్యార్థుల అభివృద్ధికి మౌళిక వసతులు కల్పించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఎంఇఒ ఆర్.శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ, ఉపాధ్యాయిని శ్రీవేణి, సిఆర్‌పి వెంగళరెడ్డి, అంగన్‌వాడి టీచర్ బుజ్జమ్మ, గ్రామస్తులు సుదర్శనం, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి డ్రమ్ములు బహూకరణ

తర్లుపాడు: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గంగిశెట్టి.కిరణ్‌కుమార్ జన్మదిన సందర్భంగా తర్లుపాడు మండలంలోని లక్ష్మక్కపల్లె ఎంపిపి స్కూల్ విద్యార్థులకు తాగునీటి వసతి కొరకు రెండు స్టీల్ ట్యాంకులు, రెండు స్టీల్ మగ్గులు, విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు కశ్శెట్టి జగన్‌బాబు వాసవి విజన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు వెలుగూరి వెంకటేశ్వర్లు, అధ్యక్షులు గుర్రం రామారావు, జోన్‌చైర్ పర్సన్ పోలేపల్లి వెంకటలక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయులు సస్పెన్షన్

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు జడ్పి ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు ఆదేశాలు జారీ చేశారు. పీఈటీ బాలునాయక్, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు ఎన్ రామకష్ణ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీరిద్దరిపై తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఈఓ విచారించి వారిద్దరిని సస్పెండ్ చేశారు.

కుల ఉన్మాదులను ఉరితీయాలి

ఎస్‌సి, ఎస్‌టి ఐక్యవేదిక ప్రతినిధుల డిమాండ్

ప్రజాశక్తి - అద్దంకి

ప్రకాశం జిల్లా దర్శి మండలం బోట్లపల్లి గ్రామంలో బాధిత కుటుంబాన్ని ఐక్యవేదిక ప్రతినిధులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కేవీపీస్ రాష్ట్ర అధ్యక్షులు ఆంద్ర మాల్యాద్రి, ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్ బాబు మాట్లాడుతూ ఒక ఎస్సీ మాల కులస్తుడైన సాయిరాం, రెడ్డి కులానికి చెందిన బ్రహ్మారెడ్డి కుమార్తెను ప్రేమ వివాహం చేసుకు న్నాడానే కారణంతో దాడి చేశారని అన్నారు. సాయిరాం అందుబాటులో లేడని అతని తల్లి, అక్కనూ వాళ్ల ఇంట్లోకి వెళ్లి కులం పేరుతో దుర్భాషలాడీ భౌతికమగా దాడిచేశారని, మారణాయుధాలతో చంపడానికి ప్రయత్నం చేశారని అన్నారు.



బోట్లపల్లి బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎస్సీ ఎస్టీ బిసి అండ్ మైనారిటీస్ ఐక్యవేదిక బాధ్యులు

పెట్రోల్ పోసి తగులబెట్టడానికి ప్రయత్నించిన బ్రహ్మారెడ్డి, అతని భార్య పుల్లమ్మను ఉరితియాలని డిమాండ్ చేశారు. దాడిలో పాల్గొన్న మరో 9 మందిని కఠినంగా శిక్షించాలని కోరారు. అప్పుడే సమాజంలో మరొకరు ఇలాంటి దురాగతాలకు పాల్పడకుండా ఉంటారని అన్నారు. బాధితులకు ప్రభుత్వం నుండి పూర్తి రక్షణ కల్పించాలని కోరారు. చట్టప్రకారం కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. భూమి, ఇంటిస్థలం, ఇల్లు, నష్ట పరిహారం వెంటనే అందించి అ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు కొమ్మాలపాటి బుజ్జిబాబు, తెలగతోటి రాధాకృష్ణమూర్తి, జ్యోతి డేవిడ్, బండారు చంటిబాబు, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు, రిటైర్డ్ తహసీల్దార్ సుబ్బారావు, ఇతర దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



విఆర్ఎ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న తహశీల్దారు

విఆర్ఎ సత్తార్‌కు నివాళి

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని జాగర్లమూడి విఆర్ఎ పటాన్ సత్తార్ ఖాన్ (59) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన జాగర్లమూడి గ్రామానికి 25సంవత్సరాలు విఆర్ఎగా సేలు అందించారు. చనిపోయిన విషయం తెలుసుకున్న తహసిల్దార్ వెంకటరెడ్డి విఆర్ఎ కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. మృతునికి నివాళి అర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతునికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. తహశీల్దారు వెంట విఆర్ఒ కాలేషా వలి, పంచాయితీ కార్యదర్శి శరత్, గ్రామ నాయకులు అమ్మిరెడ్డి, విఆర్ఎలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



పోలీసులకు సూచనలిస్తున్న ఇంకొల్లు సిఐ

ఉప ఎన్నికలకు బందోబస్తు

ప్రజాశక్తి- కారంచేడు

ఇంకొల్లు సర్కిల్లో పంచాయితీ ఉప ఎన్నికలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ వి సూర్యనారాయణ తెలిపారు. మండలంలోని స్వర్ణ పంచాయతీలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఇంకొల్లు మండలం పావులూరు సర్పంచి, కారంచేడు మండలం స్వర్ణలో ఒక వార్డుకు ఉప ఎన్నికలు జరుగనున్నాయి. పావులూరు లో 60మంది, స్వర్ణలో 100మంది సిబ్బంది ని ఏర్పాటు చేశామన్నారు. స్పెషల్ పార్టీ సిబ్బంది మరొక 30మందిని సిద్ధంగా ఉంచామన్నారు. ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ముందస్తుగా తాసిల్దార్ వద్ద పలువురిని బైండోవర్ చేశామన్నారు. ఆయన వెంట కారంచేడు ఎస్సై జి శ్రీనివాసరావు ఉన్నారు.

ఇంకొల్లు రూరల్ : పావులూరు సర్పంచ్ ఎన్నిక శనివారం జరగనుంది. సర్పంచ్ అభ్యర్థులుగా ముగ్గురు బరిలో ఉన్నారు. వైసిపి నుండి బొల్లెద్దు లుదియమ్మ, టిడిపి నుండి కొత్తపల్లి మహేష్‌బాబు, జనసేన నుండి వలేరు ఎలీషాలు పోటీలో ఉన్నారు. సర్పంచ్ బొల్లెద్దు పరిశుద్ధరావు మృతి చెందటంతో ఎన్నికలు జరుగుతున్నాయి. గ్రామంలో 3,677మంది ఓటర్లు నేడు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. జెడ్పి ఉన్నత పాఠశాల, ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాలల్లో 12 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. గతంలో సమస్యాత్మక ప్రాంతం కావటంతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం7గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్, అనంతరం ఓట్ల లెక్కింపు జరుగనుంది. సర్పంచ్ అభ్యర్థిని సాయంత్రానికి ప్రకటించే అవకాశం ఉంది. ఎన్నికల అధికారిగా జి భానూప్రసాద్ వ్యవహరిస్తున్నారు.

కర్లపాలెం : ప్రశాంతమైన వాతావరణంలో ఓటర్లు అందరూ తమ ఓటును వినియోగించుకోవాలని డిపిఒ, కర్లపాలెం ఎంపీడీవో దాసరి రాంబాబు అన్నారు. మండలంలోని బుద్ధం పంచాయితీ 6వ వార్డు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేసినట్లు శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 7 గంటల నుండీ మధ్యాహ్నం 1వరకు పోలింగ్, అనంతరం కౌంటింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ సజావుగా జరిగేటట్లు ఓటర్లు సహరించాలని కోరారు. పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఓటర్లు తమ ఓటును వినియోగించుకోవాలని కోరారు.

అవార్డు గ్రహీతలకు అభినందనలు

ప్రజాశక్తి - అద్దంకి

జిల్లా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న వారికి స్థానిక గీతామందిరంలో శింగరకొండ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. సభకు చిన్నిమురళీకృష్ణ అధ్యక్షత వహించారు. సభకు పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. తహసిల్దార్ జివి సుబ్బారెడ్డి హాజరై మాట్లాడారు. వృత్తిని దైవంగా భావించి అంకితభావంతో పనిచేస్తే ప్రజల అభిమానాన్ని, అధికారుల మన్నన పొందవచ్చున్నారు. జీవితాన్ని సార్థకం చేసుకున్న వారౌతారని అన్నారు. పశువైద్య శాఖ ఎడి మోహనరావు పురస్కారగ్రహీతల సేవలను, రోటరీ సేవలను కొనియాడారు. ప్రభుత్వ సంస్థలు, రోటరీ కలసి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చుని అన్నారు. రోటరీ సేవల వైపు సమాజం చూస్తుందని వీరవల్లి రుద్రయ్య అన్నారు. జిల్లాలో ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న ఏపీసిపిడిసిఎల్ ఇఇ నల్లూరి మస్తానరావు, మున్సిపల్ కమిషనర్ డి శ్రీనివాసులు, వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ, ఎఎస్ఒ రావూరి అమర్నాథ్, మున్సిపల్ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ కె చెంచయ్య, జివిఎస్ రామారావు, ఆర్ఐ శంకర్, లైన్ ఇన్స్‌పెక్టర్ రావులపల్లి ఏడుకొండలు, పిహెచ్



సేవా అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న రోటరీ ప్రతినిధులు

వర్కర్ వి రామకోటేశ్వరరావు, డి అలివేలు, గోపాలమిత్ర జి గోవర్ధన్, గ్రేడ్2 జెఎల్ఎం తాళ్లూరు సాంబశివరావు, అందే రమేష్, జేఏఓ డి వీరయ్య, పబ్లిక్ హెల్త్ వర్కర్ బి కోటమ్మ, జి భీష్మను రోటరీ క్లబ్ బాధ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ చప్పిడి వీరయ్య, ట్రెజరర్ కొల్లా భువనేశ్వరి, సందిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ ఉబ్బా దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, పసుపులేటి ఆంజనే యులు, మలాది శ్రీనివాసరావు, సిహెచ్ శేషారెడ్డి, నర్రా శ్రీ లక్ష్మి పాల్గొన్నారు.



కామ్రేడ్ సంజీవరావుకు సిపిఎం నివాళులు

సంజీవరావుకు సిపిఎం నివాళి

ప్రజాశక్తి - రేపల్లె

సిపిఎం సభ్యులు, పాత రేపల్లె తాలూకా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దాలిపర్తి సంజీవరావు(75) మృతికి సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ నివాళులు అర్పించారు. సంజీవరావు మృతదేహానికి సిపిఎం జెండా కప్పి నివాళులర్పించారు. నల్లురిపాలెంలో సిపిఎం ఉద్యమాల్లో చురగ్గా పాల్గొనే సంజీవరావు ఆనారోగ్యంతో చనిపోవడం సిపిఎంకు తీరని లోటని అన్నారు. సంజీవరావుకి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయ కార్మిక కుటుంబం నుండి వచ్చిన ఆయన 1980నుంచి ఆ గ్రామంలో అప్పటికే కమ్యూనిస్టు పార్టీ నాయకులుగా ఉన్నావారి ద్వారా సీపీఎం వైపు ఆకర్షితులై పార్టీలో చురుకుగా పనిచేశారని అన్నారు. వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల సమస్యలు వచ్చినప్పుడు, గ్రామంలో సామాజిక సమస్యలు వచ్చినప్పుడు సమర్థవంతంగా పనిచేశారని అన్నారు. రేపల్లె మండలం దిగువ భూములు భాడే, జన్నే కాలువ భూముల సమస్యలపై దీర్ఘకాలం సీపీఎం నిర్వహించిన పోరాటాల్లో ప్రజలను సమీకరించారని అన్నారు. తుది శ్వాస విడిచే వరకు ఎర్రజెండా బాటలో ఉన్నారని అన్నారు. ఆయన వెంట నల్లూరిపాలెం సిపిఎం కార్యదర్శి దున్న బాబురావు, సిపిఎం రేపల్లె సభ్యులు జి దానియేలు, డి శ్రీనివాసరావు, వి మావో, జె ధర్మరాజు ఉన్నారు.

ప్రారంభానికి సిద్ధమవుతున్న సొసైటీ భవనం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని సురేపల్లిలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. సొసైటీలో వచ్చిన రు.80లక్షల లాభలలో 20శాతం వాటాతో భవనం నిర్మించినట్లు చైర్మన్ గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 20న ప్రారంభించనున్నట్లు తెలిపారు. రైతుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన గోవర్ధనగిరి వెంకట సుబ్బారావు జ్ఞాపకర్థం భార్య ఉమాదేవి స్థలాన్ని ఉచితంగా దానం చేశారు. ఆ స్థలంలో రు.25లక్షలతో భవనం నిర్మించినట్లు తెలిపారు. ఈపాటికే



ప్రారంభానికి సిద్ధం చేస్తున్న సొసైటీ భవనం

సొసైటీకి స్వంత గోడౌన్ నిర్మించామని తెలిపారు. సొసైటీ ద్వారా రైతులకు వివిధ రకాల ఋణాలు అందిస్తున్నామని అన్నారు. వీటితో పాటు పొదుపు సంఘాల రుణాలు కూడా విస్తృతంగా ఇస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రూ.25కోట్ల వరకు సొసైటీ టర్నోవర్ జరుగుతుందని తెలిపారు. నూతన భవన ప్రారంభోత్సవానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున, వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి, ఎంపి నందిగం సురేష్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు, జిడిసిసి బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతా రామాంజనేయులు, బాపట్ల అర్బన్ డవలప్మెంట్ చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు పడమట రత్నం అంజయ్య, ఉడతా లక్ష్మీ నారాయణ, సిఇఓ బొర్రా శ్రీనివాసరావు, పడమట శివ నాగార్జున ఉన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - చీరాల

ముక్కోణపు పార్క్ సెంటర్లో దళిత, ప్రజా సంఘాల నేతలతో చర్చించికుండా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహ నిర్మాణమానికి మున్సిపల్ పాలంవర్గం వివక్షతో వ్యవహరిస్తుందని కలెక్టర్ రంజిత్ భాషాకు వైసిపి నాయకులు డాక్టర్ అమృతపాణి ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. నమూనా చర్చించాలని కోరారు. దళిత నేతలతో సమన్వయం చేసుకోవాలని కమిషనర్‌కు కలెక్టర్ సూచించారు. పిర్యాదు చేసినవారిలో గుమ్మడి యేసురత్నం, బత్తుల శామ్యూల్, దుడ్డు విజయసుందర్, దామర్ల శ్రీకృష్ణ, చుండూరి వాసు, దేవరపల్లి డేవిడ్ రాజు, టిఎల్ ప్రసాద్, మార్పు దీనరాజ్, గూడూరి శివరాం ప్రసాద్, ఎస్‌జి చిరంజీవి, బొంతగొర్ల చంద్ర, పందింటి రామస్వామి, పేర్లి నాని, వై ప్రసాద్, దుడ్డు దేవదానం, చిట్టిబాబు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నేతలు

జెవివి మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చీరాల

జెవివి 17వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ జెవివి నాయకులు ఎన్జీవో కార్యాలయంలో శుక్రవారం పోస్టర్‌ను తాసిల్దార్ ప్రభాకరరావు, డాక్టర్ హైమా సుబ్బారావు ఆవిష్కరించారు. జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్ర రామారావు మాట్లాడుతూ శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం ప్రజలను చైతన్య చేస్తున్నట్లు తెలిపారు. అలాంటి సామాజిక, సైన్స్ ఉద్యమాలు చేస్తున్న జెవివి 17వ రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 9, 10తేదీల్లో అంబేద్కర్ భవన్‌లో జరుగుతాయని తెలిపారు. మహాసభలను జయప్రదం చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ సభలకు గౌరవధ్యక్షులుగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, అధ్యక్షులుగా డాక్టర్ జి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా కుర్ర రామారావు, గౌరవ అధ్యక్షులుగా కె మాల్యాద్రి హాజరుకానున్నారని తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెవివి నేతలు



కారుణ్య నియామక పత్రం అందజేస్తున్న కృష్ణచైతన్య

కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత

ప్రజాశక్తి - మేదరమెట్ల

దైవాలరావురు రెవెన్యూ సహాయకుడిగా పనిచేస్తున్న ఉదరగుడి భానుచందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. భానుచందర్ భార్య ఉదరగుడి స్వాతిని గ్రామ రెవెన్యూ సహాయకురాలుగా నియమిస్తూ ప్రభుత్వ నియామక ఉత్తర్వులను అద్దంకి వైసీపీ ఇన్చార్జ్ బాచిన కృష్ణ చైతన్య శుక్రవారం అందజేశారు.

31న జగనన్న కాలనీకి ప్రారంభోత్సవం : కలెక్టర్

ప్రజాశక్తి-చీమకుర్తి

మండల పరిధిలోని కెవిపాలెం జగనన్న కాలనీ లేఅవుట్ వద్ద నిర్మించిన గృహాలనుఈనెల 31న ప్రారంభించేందుకు త్వరితగతిన పనులు పూర్తిగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను అదేశించారు. కెవిపాలెం జగనన్న కాలనీ లేఅవుట్‌ను శుక్రవారం సందర్శించారు. కాలనీ ముఖద్వారం నిర్మాణంలో డిజైన్ మార్పు గురించి మున్సిపల్ అధికారులు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ముఖద్వారం నిర్మాణానికి అడ్డుగా కరెంటు స్తంబాలను, తీగలను సరిచేయాలని ఆదేశించారు. కాలనీలో మెటల్ రోడ్డులు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటి ముందు నీటి నిల్వ గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్‌కె. ఫజులుల్లా, తహశీల్దారు పిన్నిక మధు సూదనరావు తదితరులు పాల్గొన్నారు.


జగనన్న కాలనీని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

బాలికల హాస్టల్‌లో భూచేపల్లి తనిఖీ

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక బాలిక హాస్టల్‌ను జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల భోజన వసతి, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమ స్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.